సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 18 । ఫిబ్రవరి । 2025



పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల అందజేత 8లో



ఆధునిక సాంకేతికతపై అవగాహన అవసరం 8లో



మొదటి మెట్టు.. ప్రత్యేక పట్టు 8లో

ఎన్నికల కోడ్ ధిక్కరించిన గంటా

- సింహగిరిపై ఆలయ మరమ్మతు పనులను ప్రారంభించిన గంటా
- హాజరవ్వని ఈవో, ఇంజినీరింగ్ అధికారులు, ఆలయ వైదిక పెద్దలు



ఆలయ మరమ్మతు పనులకు కొబ్బరికాయ కొడుతున్న గంటా శ్రీనివాసరావు

సింహాచలం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ధిక్కరించి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ పైకప్పు మరమ్మతు పనులను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. వర్షాలు పడినప్పుడు స్వామి ఆలయం పైకప్పు నుంచి వర్షం నీరు లోపలకి చేరుతోంది. దీంతో రూ.4 కోట్ల వ్యయంతో మరమ్మతులు చేపట్టేందుకు పుణేకు చెందిన లార్డ్ వెంకటేశ్వర చారిటబుల్ అండ్ రిలిజియస్ ట్రస్ట్ ఇటీవల ముందుకు వచ్చింది. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఎప్పుడు పనులు ప్రారంభించేదీ అధికారులు ప్రకటించలేదు. సింహగిరికి సోమవారం వచ్చిన గంటా శ్రీనివాసరావు సంబంధిత పనులను ప్రారంభించారు. అయితే దేవస్థానం ఈవో, ఇంజినీరింగ్ అధికారులు, ఆలయ అధికారులు, ప్రముఖ వైదికవర్గం ఎవరూ పాల్గొనలేదు. వారంతా ఎన్నికల కోడ్ ఉండడంతోనే పాల్గొనలేదని తెలుస్తోంది. ఆలయ నిబంధనలు, ఆగమశాస్త్ర పద్ధతులు తెలిసిన ఆలయ వైదిక పెద్దలతో పాటు, ఇంజినీరింగ్ అధికారులు లేకుండా గంటా ఎలా శంకుస్థాపన చేస్తారన్న ఆక్షేపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆది నుంచి ఆలయ మరమ్మతు పనులను గంటా తన ఖాతాలో వేసుకునేందుకు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలకు ఆయన చర్యలు బలాన్ని చేకూర్చాయి.



కదం తొక్కిన అంగన్‌వాడీలు

వేతనాల పెంపుతోపాటు గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు కదం తొక్కారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున పోరాటానికి కార్యకర్తలు, ఆయాలు సిద్ధం కావాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు.



మాపై ఎందుకీ కక్ష?

ఆంధ్రా యూనివర్సిటీలో పరిశోధక విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. ఏయూలో పీహెచ్‌డీ ప్రవేశాలు పొందిన ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 60 మందికి పైగా పరిశోధక విద్యార్థులు వీసీ భవనం ముందు గాంధీజీ, అంబేడ్కర్ విగ్రహాల వద్ద సోమవారం నిరసనకు దిగారు. వైవా, ప్రీ-పీహెచ్‌డీ పరీక్షలు వెంటనే నిర్వహించాలని ప్లకార్డులు, ఫ్లెక్సీలు చేత పట్టుకుని 'వుయ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు.

న్యూస్‌రీల్

జిల్లాకు చేరుకున్న బ్యాలెట్ పత్రాలు



ఎమ్మెల్సీ బ్యాలెట్ పత్రాలను పరిశీలిస్తున్న ఏఆర్వో భవానీ శంకర్

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానం ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పత్రాలు జిల్లాకు చేరుకున్నాయి. ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు, పోటీ చేసే అభ్యర్థుల ఫొటోలు, ఇతర వివరాలను ఇక్కడి నుంచి అధికారులు పంపించగా, సంబంధిత బ్యాలెట్ పత్రాలను కర్నూలులో ప్రింటింగ్ చేశారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో సోమవారం కలెక్టరేట్‌కు తీసుకొచ్చారు. 10 శాతం రిజర్వ్‌తో కలిపి జిల్లాలోని పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్యకు సరిపడా పత్రాలను అధికారులు సేకరించి భద్రపరిచారు. ఏఆర్వో, జిల్లా రెవెన్యూ అధికారి బి.హెచ్. భవానీ శంకర్ ఈ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం సంబంధిత వాహనానికి పోలీసులు, ఇతర లైజనింగ్ అధికారుల సమక్షంలో సీలు వేసి ఉత్తరాంధ్ర జిల్లాలకు పంపించారు.

స్పెషల్ పర్పస్ వెహికల్ కమిటీ ఏర్పాటు

అల్లిపురం: గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌లో భాగంగా స్పెషల్ పర్పస్ వెహికల్(ఎస్‌పీవీ) కమిటీని ఏర్పాటు చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ చైర్మన్‌గా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ వ్యవహరిస్తారు. వైస్ చైర్మన్‌గా కలెక్టర్, డైరెక్టర్‌గా వీఎంఆర్‌డీఏ కమిషనర్, మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా జీవీఎంసీ కమిషనర్, డైరెక్టర్లుగా జీవీఎంసీ అడిషనల్ కమిషనర్, చీఫ్ ఇంజినీర్‌తో పాటు మరో ఇద్దరు వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

కాసులిస్తేనే కరెంట్ కనెక్షన్..!



- సార్.. కొత్తగా ఇల్లు కట్టుకున్నాం.. కరెంట్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నాం.. ఎప్పుడు వస్తుందని.. ఎవరైనా సాధారణ ప్రజలు అడిగితే.. 'మీ లోకల్ లీడర్ నుంచి సిఫార్సు తీసుకురా.. అప్పుడే పని త్వరగా పూర్తవుతుంది. దాంతో పాటు ఎంతో కొంత సర్దుబాటు చెయ్.. మీ ఇంటికి వెలుగులు వచ్చేస్తాయి.'
- ఈపీడీసీఎల్ విశాఖపట్నం సర్కిల్ పరిధిలోని అధికారులు, సిబ్బంది చెబుతున్న మాటలు ఇవి.

- జోన్-1 పరిధిలో 80 అడుగుల రోడ్డు ప్రాంతానికి చెందిన ప్రసన్నకుమార్ కొత్తగా కడుతున్న గ్రూప్ హౌస్‌కు విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేశారు. నెల రోజులైనా స్పందన రాకపోవడంతో విశాఖ సర్కిల్ కార్యాలయానికి వెళ్లి అడగ్గా.. దిగువ స్థాయి అధికారిని సంప్రదించాలని చెప్పారు. సదరు అధికారిని అడగ్గా.. మీ లోకల్ టీడీపీ లీడర్ నుంచి ఒక్క ఫోన్ చేయించండి చాలు.. మీ పనైపోతుందని అన్నారు. లీడర్ దగ్గరికి వెళ్లి బతిమిలాడారు. అక్కడి నుంచి జోన్ సిబ్బందికి ఫోన్ వెళ్లింది. వెంటనే సదరు విద్యుత్ ఉద్యోగి ప్రత్యక్షమై.. ఫార్మాలిటీస్ ఉన్నాయంటూ లెక్క చెప్పి రూ.50 వేలు కప్పం కట్టించుకున్నారు. అంతే రెండు రోజుల్లో కొత్త కనెక్షన్ వచ్చేసింది.
- ఇదీ కొంత కాలంగా ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్‌లో నడుస్తున్న దందా. కొత్త విద్యుత్ కనెక్షన్ కావాలంటే.. కచ్చితంగా ఆ ఏరియాకు చెందిన కూటమినేత నుంచి ఫోన్ రావాల్సిందే.

- కొత్త మీటర్ కావాలంటే విద్యుత్ అధికారుల చేయి తడపాల్సిందే..
- కూటమి నేతలతో కలిసి బరితెగిస్తున్న ఈపీడీసీఎల్ సిబ్బంది
- కొత్త కనెక్షన్ల కోసం వేల సంఖ్యలో దరఖాస్తులు
- అపార్ట్‌మెంట్ కనెక్షన్‌కు రూ.50 వేలు, వ్యక్తిగత కనెక్షన్‌కు రూ.5 వేలు వసూలు

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలో ప్రస్తుతం 18,42,691 మంది ఎల్‌టీ కేటగిరీ వినియోగదారులు, 1858 హెచ్‌టీ కేటగిరీ వినియోగదారులున్నారు. గత ఐదేళ్ల కాలంలో కొత్త విద్యుత్ కనెక్షన్ కావాలంటే సులువుగా దొరికేది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా.. స్థానిక ఏఈ కార్యాలయంలో సంప్రదించినా.. కేటగిరీల వారీగా ఫీజులు చెల్లించేవారు. నిర్దేశిత గడువులో కొత్త కనెక్షన్ మంజూరయ్యేది. 2022 నుంచి 2024 ఏప్రిల్ మధ్య కాలంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో దాదాపు 80 వేల



ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ శాఖ భవన్

కొత్త కనెక్షన్లు పెరిగాయి. కానీ.. ఎక్కడా లంచాలకు తావులేకుండా మంజూరు చేసేవారు. ఇప్పుడు కాలం మారిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఈపీడీసీఎల్ సర్కిల్ అధికారులు కమర్షియల్‌గా మారిపోయారు. కనెక్షన్ కావాలంటే చేయి తడపాల్సిందేనని భీష్మించుకు కూర్చుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక లైన్‌మెన్‌లు, ఏఈలు దరఖాస్తులను ప్రాసెసింగ్ చేస్తున్నా.. వాటిని ఆపాలంటూ కూటమి నేతలు హుకుం జారీ చేస్తున్నారని తెలుస్తోంది. తమ ఆదేశాలు వచ్చేంత వరకూ కొత్త దరఖాస్తుల జోలికి వెళ్లొద్దంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారంట. అందుకే విశాఖ సర్కిల్ పరిధిలో వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

కూటమి నేతలతో కుమ్మక్కు!

విద్యుత్ కనెక్షన్లు ఏమైనా కొత్తవి మంజూరు చేయాలంటే కచ్చితంగా తమను సంప్రదించేలా చూడాలంటూ కూటమి నేతలు విశాఖపట్నం సర్కిల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏ దరఖాస్తు వచ్చినా దానిపై దృష్టి సారించడం లేదు. దరఖాస్తుదారులు వచ్చి తమ కొత్త కనెక్షన్ గురించి అడిగితే... కూటమి నేతలతో కుమ్మక్కై అందినకాడికి దోచుకుంటూ పంచుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. వ్యక్తిగత కనెక్షన్‌కు కేటగిరీ బట్టి రూ.5 వేలు నుంచి రూ.10 వేలు.. అపార్ట్‌మెంట్స్, విల్లాలు, గ్రూప్‌హౌస్‌లకు విస్తీర్ణం, ఫ్లాట్లను బట్టి రూ.50 వేల నుంచి రూ.లక్షకుపైగా రేటు ఫిక్స్ చేశారని తెలుస్తోంది. దీంతో ఇల్లు కట్టుకున్న ప్రతి ఒక్కరికీ విద్యుత్ కచ్చితంగా అవసరం కాబట్టి.. ఎంత డిమాండ్ చేస్తే అంత చెల్లింపులు చేసి కనెక్షన్ తీసుకుంటున్నామని వినియోగదారులు వాపోతున్నారు.

ఫిర్యాదులపై లోతైన విశ్లేషణ

- పీజీఆర్ఎస్ పెండింగ్ ఫిర్యాదుల సమీక్షలో అధికారులతో కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- 18 నుంచి 28 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో డీఆర్వో భవానీ శంకర్, తదితరులు

మహారాణిపేట: ఒకే సమస్యపై ప్రజల నుంచి పదే పదే వచ్చే వినతులపై లోతైన విశ్లేషణ అవసరమని, వాటికి నాణ్యమైన పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వస్తున్న ఫిర్యాదులు, అధికారులు తీసుకుంటున్న చర్యలపై సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. అధికారులకు పలు అంశాలపై అనుసరించాల్సిన విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డ తర్వాతే.. వాటి పరిష్కారం కోసం అధికారుల వద్దకు వస్తారని, అలా వచ్చే వారికి సాంత్వన చేకూర్చేలా అధికారులు నడుచుకోవాలని, వారి సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపించి భరోసా కల్పించాలని పేర్కొన్నారు. పదే పదే ప్రజలను కార్యాలయాలు చుట్టూ తిప్పించుకోవడం ఏమాత్రం శ్రేయస్కరం కాదని హితవు పలికారు.

అర్జీదారులతో ఫోన్లో మాట్లాడాలి

ఫిర్యాదు చేసే అర్జీదారులతో సంబంధిత అధికారులు నేరుగా ఫోన్ చేసి మాట్లాడాలని, వారి సమస్య పూర్వాపరాలను తెలుసుకుని వాటికి సరైన పరిష్కారం చూపాలని కలెక్టర్ చెప్పారు. సమస్య క్లిష్టమైనది అయితే క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫిర్యాదు రీ-ఓపెన్ కావడానికి వీల్లేదన్నారు. అలా జరిగితే సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పీజీఆర్ఎస్ నోడల్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఒక శాఖకు వచ్చిన ఫిర్యాదు మరొక శాఖకు చెందినదైతే చాలా మంది రిఫర్ చేసి ఊరుకుంటున్నారని, అలా కాకుండా అర్జీదారుతో నేరుగా మాట్లాడి సమస్య ఏ శాఖ పరిధిలోదో తెలియజేసి, సహకారం అందించాలని సూచించారు.

18 నుంచి 28 ప్రత్యేక ఆధార్ క్యాంపులు

సమావేశంలో భాగంగా ఈ నెల 18 నుంచి 28 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించేందుకు ప్రణాళికలు చేసుకున్నామని సచివాలయాల కోఆర్డినేటర్ ఉషారాణి తెలుపగా.. పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని అధికారులంతా ఇంటింటా సర్వేలో భాగంగా జియో ట్యాగింగ్ చేయించుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర-2047లో భాగంగా అన్ని విభాగాల అధికారులు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, ప్రత్యేక ఉప కలెక్టర్లు శేషశైలజ, సీతారామారావు, జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

20 నుంచి ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరణ



తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-లోకమాన్య తిలక్ టెర్మినస్- విశాఖపట్నం మధ్య నడిచే లోకమాన్య తిలక్ టెర్మినస్ ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. విశాఖపట్నం-లోకమాన్య తిలక్ టెర్మినస్ (18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20 నుంచి, లోకమాన్య తిలక్ టెర్మినస్-విశాఖపట్నం(18520) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22 నుంచి యథావిధిగా రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు.

శ్రీకాకుళం రోడ్-చర్లపల్లి మధ్య స్పెషల్ రైలు

చర్లపల్లి-శ్రీకాకుళంరోడ్-చర్లపల్లి మధ్య స్పెషల్ రైలు నడుపుతున్నట్లు సీనియర్ డీసీఎం తెలిపారు. చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్(07025) స్పెషల్ ఈ నెల 21న చర్లపల్లిలో రాత్రి 9.15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.45 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.47 గంటలకు బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీకాకుళం రోడ్ వెళ్తుంది. శ్రీకాకుళం రోడ్-చర్లపల్లి(07026) స్పెషల్ ఈ నెల 22న మధ్యాహ్నం 2.15 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయలుదేరి సాయంత్రం 4.45గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 4.47 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు చర్లపల్లి వెళ్తుంది.

పలు రైళ్లు రద్దు...

ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 19న విశాఖపట్నం-షాలిమర్(22854) ఎక్స్‌ప్రెస్, 21న సంత్రగచ్చి-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (22807) ఎక్స్‌ప్రెస్, 23న ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-సంత్రగచ్చి(22808) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

రిజర్వ్ బ్యాంక్ పేరుతో మోసాలు

- ముగ్గురు ముఠా సభ్యుల అరెస్టు
- పరారీలో ప్రధాన నిందితుడు



పోలీసుల అదుపులో ఉన్న లక్ష్మీ ప్రసన్న, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు

గోపాలపట్నం: రిజర్వ్ బ్యాంక్ ద్వారా కోట్లాది రూపాయలు, విల్లాలు ఇప్పిస్తామని.. రూ.5 వేలు కడితే కోటి వరకు నజరానా వస్తుందని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ముఠా సభ్యులను సోమవారం టాస్క్‌ఫోర్స్, ఎయిర్‌పోర్టు పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివి.. రెండు రాష్ట్రాల్లో ఓ ముఠా రైస్ పుల్లింగ్, రిజర్వ్ బ్యాంక్ సర్టిఫికెట్లు వంటి పలు రకాల మోసాలకు పాల్పడుతోంది. ఇందులో కొందరు ముఠా సభ్యులు విశాఖలో ఉన్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మర్రిపాలెం వుడా లేఅవుట్ పార్క్ సమీపంలో ఒక ఇంటిపై దాడి చేశారు. విశాఖకు చెందిన లక్ష్మీ ప్రసన్న, కోటేశ్వరరావు, కాకినాడకు చెందిన శ్రీనివాసలను అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ప్రధాన నిందితుడైన యడ్లపల్లి నారాయణ మూర్తి పరారయ్యాడు. వీరు గతంలో పలు చోట్ల దొంగ నోట్లు చలామణి చేయడం, రూ.5 వేలు, రూ.10 వేలు కడితే కోట్ల రూపాయలు వస్తాయని నమ్మించి మోసాలకు పాల్పడ్డారు. వీరు విశాఖ, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాలను అడ్డాగా మార్చుకుని ప్రజలను ఏమార్చుతున్నారు. కాగా.. టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితులను ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించారు. దీనిపై ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ముఠా బారిన పడిన బాధితులు ఎంతమంది ఉన్నారనే దానిపై ఆరా తీస్తున్నారు. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు.

విజ్ఞాన్ కళాశాలలో విద్యార్థుల కొట్లాట

- యువతరంగం వేడుకలో ఘర్షణ
- ఓ విద్యార్థికి తీవ్ర గాయాలు



కళాశాలలో కొట్టుకుంటున్న విద్యార్థులు

కూర్మన్నపాలెం: విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు రెచ్చిపోయారు. యుద్ధాన్ని తలపించేలా ఒకరినొకరు కొట్టుకుని బీభత్సం సృష్టించారు. ఈ కొట్లాటలో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనపై దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీఐ కె.మల్లేశ్వరరావు అందించిన సమాచారం మేరకు.. కళాశాలలో ఏటా యువతరంగ్ పోస్టర్ విడుదల కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే భారీ ఎత్తున ఏర్పాట్లు చేసి, ఆవిష్కరిస్తున్న సమయంలో విద్యార్థులు డ్యాన్సులు చేశారు. ఆ సమయంలో ఒక విద్యార్థికి మరో విద్యార్థి కాలు తగిలింది. ఆ విద్యార్థి క్షమాపణ చెప్పినప్పటికీ శాంతించని కాలు తగిలిన విద్యార్థి ఘర్షణకు దిగాడు. దీంతో ఈ వివాదం చిలికి చిలికి గాలివానగా మారి.. ఒకరినొకరు పిడిగుద్దులు గుద్దుకున్నారు. దీంతో కళాశాల ఆవరణ అంతా గందరగోళంగా మారిపోయింది. ఈ ఘర్షణలో ఈశ్వర్ అనే తృతీయ సంవత్సరం విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై ఈశ్వర్ దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ మల్లేశ్వరావు కేసు నమోదు చేశారు. ఇందుకు బాధ్యులైన బీటెక్ చదువుతున్న సూర్యకిరణ్, జయసూర్య, మరికొంతమంది విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పూర్తి వివరాలు సేకరించి బాధ్యులందరిపైనా వివిధ సెక్షన్ల కింద కేసులు పెట్టి అరెస్టు చేస్తామన్నారు. ప్రస్తుతం కాలేజీలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నట్లు తెలిపారు. ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాల్‌మనీ ఒత్తిళ్లతో వ్యక్తి ఆత్మహత్య

- రూ.5 వేలు అప్పుచేసిన శంకరరావు
- డబ్బులు చెల్లించాలని వడ్డీ వ్యాపారుల వేధింపులు

మధురవాడ: మారికవలస రాజీవ్ గృహకల్పలో విషాదం చోటుచేసుకుంది. కాల్ మనీ వ్యాపారుల ఒత్తిళ్లు తాళలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజీవ్ గృహకల్పలో ఉంటున్న దాసరి శంకరరావు (40)కు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అతడు గతంలో సొంత అవసరాల నిమిత్తం వడ్డీ వ్యాపారుల వద్ద రూ.5 వేలు ఫైనాన్స్ తీసుకున్నాడు. వారం రోజుల నుంచి ఫైనాన్స్ కట్టక పోవడంతో వడ్డీ వ్యాపారులు.. శంకరరావు ఇంటికి వచ్చి దుర్భాషలాడారు. వెంటనే డబ్బులు చెల్లించాలని ఒత్తిడి చేశారు. మనస్తాపం చెందిన శంకరరావు సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతని భార్య పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావ వేడుకలు లేనట్టే?

ఉద్యోగుల్లో అసంతృప్తి

నేడు నిరసన



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావ వేడుకలు ఈ ఏడాది లేనట్టే.! ఉద్యోగులకు ఇచ్చే జవహర్‌లాల్ నెహ్రూ అవార్డుల ప్రదానం కూడా వాయిదా పడింది. దీంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయగా కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్ 1982లో ఏర్పాటైంది. ప్లాంట్ ఏర్పాటై మంగళవారానికి 43 ఏళ్లు పూర్తవుతున్నాయి. గత 42 ఏళ్లుగా ఏటా ఫిబ్రవరి 18న ఆవిర్భావ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా మొక్కలు నాటడం, సైకిల్ ర్యాలీ, ప్రత్యేక నడక, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించేవారు. అదే విధంగా ఉక్కు త్రిష్టా మైదానంలో ఉద్యోగుల కుటుంబ సభ్యుల సమక్షంలో క్రమశిక్షణ, అంకిత భావంతో పని చేసే అధికారులు, కార్మికులకు జవహర్‌లాల్ నెహ్రూ అవార్డుల ప్రదానం జరిగేది. అయితే 2023-24 సంవత్సరానికి అధికారులకు చెందిన ఏసీఆర్‌లు సిద్ధం కాలేదన్న కారణంతో.. యాజమాన్యం వేడుకలు నిర్వహించడం లేదనే సమాచారంతో ఉద్యోగులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకతలు గణనీయంగా పెరగడంతో పాటు మంచి స్థితికి చేరింది. త్వరలో మూడో బ్లాస్ట్ ఫర్నేస్ ప్రారంభించే తరుణంలో ఉద్యోగులను ప్రోత్సహించాల్సిన యాజమాన్యం తీసుకున్న తాజా నిర్ణయంతో ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యం నిర్ణయానికి నిరసనగా మంగళవారం ఉదయం కార్మిక సంఘాలు ఉక్కు స్మృత్యంజలి కూడలి వద్ద నిరసన తెలపనున్నట్లు గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు, పోరాట కమిటీ కన్వీనర్ కె.ఎస్.ఎన్.రావు తెలిపారు.

బ్యూటీ బార్ ముసుగులో వ్యభిచారం

- నలుగురు అరెస్టు



బ్యూటీ బార్ నిర్వహిస్తున్న భవనం ఇదే..

కూర్మన్నపాలెం: అందం మెరుగుదిద్దే ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న బ్యూటీ బార్‌పై పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో విటుడు, మహిళ, బార్ నిర్వాహకుడు, ఆయన సహాయకుడిని అరెస్టు చేసినట్లు దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరావు తెలిపారు. కూర్మన్నపాలెం ప్రధాన రహదారిపై ఎస్ఎస్ బ్యూటీ బార్‌లో వ్యభిచారం జరుగుతోందన్న సమాచారంతో ఆదివారం అర్ధరాత్రి పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో పట్టుబడిన నలుగురిని అరెస్టు చేశామని సీఐ తెలిపారు. ఈ కేసు విచారణ జరుగుతోందని, పూర్తి వివరాలు సేకరించి నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల అందజేత

తాటిచెట్లపాలెం: వివిధ రైళ్లు, రైల్వే స్టేషన్లలో ప్రయాణికులు పోగొట్టుకున్న, మరచిపోయిన మొబైళ్లను సోమవారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు తిరిగి వారికి అందజేశారు. సుమారు 10 లక్షల రూపాయల విలువైన మొత్తం 54 మొబైల్ ఫోన్లను సంబంధిత ప్రయాణికులకు అందజేసినట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు తెలిపారు. చోరీకి గురైన మొబైళ్లు హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, కాకినాడ, రాజమహేంద్రవరం, విజయనగరం, శ్రీకాకుళం పరిసర ప్రాంతాల్లో ఉన్నట్లు సీఈఐఆర్ సైట్ ద్వారా గుర్తించి.. వాటిని రికవరీ చేసినట్లు వివరించారు. ఈ మొబైళ్లను డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ పి.రామచంద్రరావు ఆదేశాల మేరకు బాధితులకు అందజేసినట్లు వెల్లడించారు. ఎస్ఐలు ఎస్.కె.మారూఫ్, ఎస్.రామారావు, క్రైం హెడ్ కానిస్టేబుల్ ఎల్.ఉదయ్‌భాస్కర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

శిర్లపాలెం వాసి హైదరాబాద్‌లో ఆత్మహత్య

తగరపువలస: ఆనందపురం మండలం శిర్లపాలెం పంచాయతీకి చెందిన కె.సూర్యనారాయణ(45) అనే లారీ డ్రైవర్ ఆదివారం హైదరాబాద్‌లో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. ఇటీవల సూర్యనారాయణ హైదరాబాద్ వెళ్లాడు. తనకు పరిచయం ఉన్న వరలక్ష్మి అనే వివాహిత ఇంటికి శనివారం వెళ్లి ఆమె భర్త దుర్గాప్రసాద్‌తో కలిసి మద్యం సేవించాడు. తర్వాత ఇద్దరి మధ్య వివాదం కారణంగా సూర్యనారాయణను దుర్గాప్రసాద్ గాయపరిచి ఆస్పత్రిలో చేర్పించాడు. ఆదివారం ఉదయం దుర్గాప్రసాద్ ఇంటి ముందు సూర్యనారాయణ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో స్థానికులు, పోలీసులు కలిసి సూర్య నారాయణను చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సూర్యనారాయణ మృతదేహాన్ని మంగళవారం శిర్లపాలెం తీసుకొస్తున్నట్లు తెలిసింది.



రాష్ట్రంలోనే అతి పెద్ద ప్రభుత్వ రంగ విద్యా సంస్థగా పేరొందిన చంద్రంపాలెం జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి పరీక్షలకు సమాయత్తమవుతోంది. శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సమష్టి కృషితో నిరంతరం శ్రమిస్తున్నారు. పరీక్షల ప్రాధాన్యతను గుర్తెరిగి విద్యార్థులు పట్టుదల తో చదువుతుంటే.. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

– మధురవాడ

మొదటి మెట్టు.. ప్రత్యేక పట్టు

చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(ఇంగ్లిష్ మీడియం) ప్రభుత్వ విద్యా రంగంలో ఒక ప్రత్యేక అధ్యాయం. రాష్ట్రంలోనే అతి పెద్ద పాఠశాలగా గుర్తింపు పొందిన ఇక్కడ సుమారు 3,235 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలకు 799 మంది సిద్ధమవుతున్నారు. వంద మందికి పైగా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం ఈ పాఠశాలకు పెద్ద ఆస్తి. పదో తరగతి పరీక్షలు విద్యార్థుల జీవితంలో ఒక మైలురాయి వంటివి. ఈ పరీక్షల ఫలితాలే వారి భవిష్యత్‌ను నిర్ణయిస్తాయి. ఈ విషయాన్ని గుర్తెరిగిన ఉపాధ్యాయులు, విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో టీచర్లు మరింత నిబద్ధతతో పనిచేస్తున్నారు. తరగతి గదిలో పాఠాలు బోధించడంతోపాటు, వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి వారిపై దృష్టి సారిస్తున్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి ఫలితాలు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. 100 రోజుల ప్రణాళికను విజయవంతంగా అమలు చేసేందుకు ఆర్జేడీ విజయభాస్కర్, డీఈవో ప్రేమ్‌కుమార్, సర్వశిక్ష ఏపీసీ డాక్టర్ చంద్రశేఖరరావు తదితరులు సైతం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ప్రణాళిక అమలు ఇలా..

జిల్లాలో మార్చి 17 నుంచి రోజు విడిచి రోజు 10వ తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ విద్యార్థులను ఏ నుంచి ఓ వరకు 12 సెక్షన్‌లుగా విభజించారు. ఇందులో ప్రతి సెక్షన్, ప్రతి సబ్జెక్టుకు సంబంధించి ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజించారు. శత శాతం ఉత్తీర్ణతకు 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తున్నారు.



ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థినులు

తరగతిలో బోధనతో పాటు ప్రతి రోజూ ఉదయం 8 గంటలు నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి 5 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వ్యక్తిగత సామర్థ్యాలపై దృష్టి పెట్టి, అందుకు అనుగుణంగా బోధన చేస్తున్నారు. మెరిట్ విద్యార్థులకు ప్రత్యేక టిప్స్, శిక్షణ ఇస్తున్నారు. పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన వారిని గుర్తించి.. వారి సామర్థ్యాలు పెంపునకు కృషి చేస్తున్నారు.



సాయంత్రం క్లాసులకు హాజరైన పిల్లలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఉపాధ్యాయులు

తల్లిదండ్రుల సహకారం అవసరం



పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయి. పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులు చూడాలి. 113 మంది సక్రమంగా పాఠశాలకు రావడం లేదు. వారి మీద మరింత దృష్టి పెట్టి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. వారి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడాం. పిల్లలు స్కూల్‌కు వచ్చేలా ఏర్పాట్లు చేశాం. శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా సమష్టిగా పనిచేస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. – గొట్టేటి రవి, హెచ్‌ఎం

100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు



శత శాతం ఉత్తీర్ణత కోసం ప్రభుత్వం ఇచ్చిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ ఆధారంగా బోధన చేస్తున్నాం. పాఠశాలకు సక్రమంగా రాని విద్యార్థులను వారి తల్లిదండ్రులతో మాట్లాడి వచ్చేటట్లు చేయగలిగాం. వారి సామర్థ్యాల ఆధారంగా బోధన చేస్తున్నాం. ప్రీ ఫైనల్ పరీక్షలకు అందరూ వస్తున్నారు. టార్గెట్ సాధించడానికి అన్ని చర్యలు చేపడుతున్నాం.

– సి.సోమేష్, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు

పీపీటీ ద్వారా బోధన



ప్రస్తుతం సోషల్ స్టడీస్‌కు సిలబస్ ఎక్కువగా ఉంది. నాలుగు టెక్స్ట్ బుక్స్, 30 పాఠాలు ఉన్నాయి. సిలబస్‌ను క్రోడీకరించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఐఎఫ్‌బీ ప్యానెల్‌ను ఉపయోగించి బోధన చేస్తున్నాం. ఇవి చాలా ఉపయోగపడుతున్నాయి. వెనుకబడిన విద్యార్థులతో మ్యాప్ పాయింటింగ్, పరీక్షల్లో ఎక్కువగా వచ్చే ప్రశ్నలు, వాటి సమాధానాలు చదివిస్తున్నాం. – ఎస్.మోహన్‌కుమార్, సోషల్ టీచర్

బ్లూ ప్రింట్ ఆధారంగా బోధన



బాగా వెనుకబడిన, బిలో యావరేజ్ పిల్లలకు ప్రభుత్వం ఇచ్చిన బ్లూప్రింట్ ఆధారంగా బోధన చేస్తున్నాం. 1, 2, 4 మార్కుల ప్రశ్నలపై వీరికి బాగా శిక్షణ ఇచ్చి కనీస మార్కులు సాధించే విధంగా చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా పటాలు, పట్టికల ద్వారా మార్కులు సాధించే పద్ధతిపై మరింత తర్ఫీదు ఇస్తున్నాం. విద్యార్థులు కష్టపడి చదువుతున్నారు.

–కేవీ మోహనరావు, ఎస్ఎస్ ఉపాధ్యాయుడు

సమస్యలు సాధించడంలో శిక్షణ



గణితంలో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులకు ఐదు అధ్యాయాల్లోని ముఖ్యమైన సమస్యలను సులభంగా సాధించడానికి అవసరమైన శిక్షణ ఇస్తున్నాం. ఎస్సీఈఆర్‌టీ ఇచ్చిన మోడల్ పేపర్లు, డీఈఈబీ ఇచ్చిన స్టడీ మెటీరియల్‌ను ప్రత్యేక తరగతుల్లో సాధన చేయిస్తున్నాం. గణిత ఉపాధ్యాయులంతా ఇదే నమూనాలో బోధన చేస్తున్నారు.

– స్వామి, గణిత ఉపాధ్యాయుడు

పరీక్షలంటే ఒత్తిడి లేదు



ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు, ఈజీగా అర్థమయ్యే టెక్నిక్స్ చెబుతున్నారు. స్టడీ మెటీరియల్ కూడా ఇచ్చారు. పరీక్షలు దగ్గర పడినా టెన్షన్ లేదు. మంచి మార్కులు సాధించగలమనే నమ్మకం ఉంది. గతంలో ఈవెనింగ్ స్నాక్స్ ఇచ్చే వారు. ఇప్పుడు కూడా అలా ఇస్తే బాగుంటుంది. ఆరిలోవ, ఆనందపురం వంటి ప్రాంతాల నుంచి ఇక్కడకు విద్యార్థులు వస్తున్నారు. – జి.ధనలక్ష్మి, విద్యార్థిని, స్వతంత్రనగర్

ఇళ్లకు వచ్చి అవగాహన కల్పిస్తున్నారు



చంద్రంపాలెం హైస్కూల్ ఉపాధ్యాయులు పిల్లలకు స్కూల్లో చదువు చెప్పడమే కాదు. ఎవరైనా సరిగా చదవకపోయినా, స్కూలుకు రాకపోయినా, వారిని ఎలా చదివించాలో అనే విషయాలపై నివాస ప్రాంతాల్లో తల్లిదండ్రులకు, పిల్లలకు అవగాహన కల్పిస్తున్నారు. మంచి ప్రయత్నం చేస్తున్నారు. పిల్లలు మంచి మార్కులు సాధించడానికి ఇది ఎంత గానో దోహదపడుతుంది.

– సాగి శ్రావణి, సద్గురు సాయినాథ కాలనీ, మధురవాడ

సుహానీ మాల్ యాజమాన్యంపై ఫిర్యాదు

అల్లిపురం: 'టర్నల్ చౌల్ట్రీ దరి సూపర్ బజార్‌కు చెందిన స్థలాన్ని బ్యాంకులో తనఖా పెట్టి.. అనుబంధ సంస్థ పేరిట సుహాని మాల్ యాజమాన్యం రుణం తీసుకుంది. దీనిపై సోమవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం.' అని సూపర్‌బజార్ ఎండీ పి.శ్రీనివాసరాజు తెలిపారు. జాయింట్ కలెక్టర్, సంస్థ చైర్మన్ మయూర్ అశోక్ ఆదేశాల మేరకు న్యాయ సలహా తీసుకుని టూటౌన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బి.తిరుమలరావు తెలిపారు.

ఆధునిక సాంకేతికతపై అవగాహన అవసరం



ఆచార్యులతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య : యువతరం నూతన సాంకేతికతలపై మెరుగైన అవగాహన కలిగి ఉండాలని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. సోమవారం వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో జియో ఫిజిక్స్ విభాగం ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా నిర్వహించిన 'అడ్వాన్సెస్ ఇన్ జియో ఫిజిక్స్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్, అండ్ నేచురల్ రిసోర్సెస్' ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇటువంటి సదస్సులు నూతన జ్ఞానాన్ని అందిపుచ్చుకోవడానికి ఎంతో ఉపయోగంగా నిలుస్తాయని చెప్పారు. జియో ఫిజిక్స్ రంగంలో ఆధునిక పరిజ్ఞానాన్ని, సాంకేతికతలను పరస్పరం పంచుకోవడానికి ఈ సదస్సు వేదికగా నిలుస్తుందని చెప్పారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ ప్రకాష్ చౌహాన్ మాట్లాడుతూ దేశానికి అవసరమైన విలువైన మానవ వనరులను ఏయూ జియో ఫిజిక్స్ విభాగం అందించిందని చెప్పారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై అన్వేషణలు జరగాలని సూచించారు. జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డీడీ జి.సుజిత్ కుమార్ త్రిపాఠి మాట్లాడుతూ గ్రీన్ హౌస్ గ్యాస్ విడుదల పెరగడం వల్ల ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయని చెప్పారు. సుస్థిరమైన భవిష్యత్తు, పర్యావరణ సమస్యలకు పరిష్కారాల చూపే విధంగా యువత పనిచేయాలని పిలుపునిచ్చారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, విభాగాధిపతి ఆచార్య సి.వి.నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.

వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్ల ధర్నా



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు

సీతమ్మధార: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు వేతనాలు పెరగలేదన్నారు. వేతనాల పెంపు, తదితర సమస్యల పరిష్కారం కోసం 42 రోజు సమ్మె చేశామని గుర్తు చేశారు. ఈ క్రమంలో 2024 జూలైలో వేతనాలు పెంచుతామని రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని, ఇతర సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చిందన్నారు. అయినప్పటికీ నేటి వరకు సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలియజేసినట్లు చెప్పారు. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వం స్పందించాలని, లేకపోతే పెద్ద ఎత్తున పోరాటానికి కార్యకర్తలు, ఆయాలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ వెంటనే జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు అంగన్‌వాడీలకు అమలు చేయాలని, సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలని కోరారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కార ఖర్చులకు రూ. 20 వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటలక్ష్మి, ఎల్.దేవి, అర్బన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు నూకరత్నం, జిల్లా కోశాధికారి పద్మ, ఉపాధ్యక్షులు శోభారాణి, నాగేశ్వరి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, కార్యదర్శి జి.అప్పలరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

సొత్తు స్వాధీనం



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు చూపిస్తున్న డీసీపీ లతా మాధురి

ఆరిలోవ : ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు రోజుల కిందట చోరీకి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకోవడంతోపాటు అతడి వద్ద నుంచి సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు క్రైం విభాగం డీసీపీ లతా మాధురి తెలిపారు. పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆమె విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈనెల 14న పాతడెయిరీఫారం సమీపం జాతీయరహదారిని ఆనుకొని రాజీవ్‌నగర్‌లోని వసంత విహార్‌లో ఈరాకి సత్యనారాయణ ఫ్లాట్‌లో దొంగలు పడి సుమారు 3 తులాల బంగారు ఆభరణాలు, దానికి సమీపంలో సాయి రెసిడెన్సీలో చుక్కా వంశీకృష్ణ ఇంట్లో 28 తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండి వస్తువులు, రూ.లక్ష నగదు, ల్యాండ్ డాక్యుమెంట్లు దోచుకుపోయారని తెలిపారు. దీనిపై బాధితులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఆరిలోవ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి 24 గంటల్లో దొంగను పట్టుకున్నట్లు తెలిపారు. మల్కాపురం ప్రాంతం గొల్లవీధికి చెందిన నూనెల కృష్ణ ఈ దొంగతనాలు చేసినట్లు చెప్పారు. అతని నుంచి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.73,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కృష్ణ పాత నేరస్తుడని, అతనిపై పలు పోలీస్ స్టేషన్లలో 20 కేసులు ఉన్నట్లు తెలిపారు. పలుమార్లు జైలుకు వెళ్లినట్లు వివరించారు. ఈ కేసు ఛేదించిన క్రైం విభాగం అధికారులను ఆమె అభినందించారు.

మాపై ఎందుకీ కక్ష?

- ఏయూలో పీహెచ్‌డీ స్కాలర్స్ నిరసన గళం
- వైస్ చాన్సలర్ కార్యాలయం ముందు ఆందోళన
- పరీక్షలు ఎందుకు రద్దు చేశారో చెప్పాలని పట్టు



మాట్లాడుతున్న పరిశోధన విద్యార్థిని

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో పరిశోధక విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. ఏయూలో పీహెచ్‌డీ ప్రవేశాలు పొందిన ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 60 మందికి పైగా పరిశోధక విద్యార్థులు వీసీ కార్యాలయం ముందు గాంధీజీ, అంబేడ్కర్ విగ్రహాల వద్ద సోమవారం నిరసనకు దిగారు. వైవా, ప్రీ-పీహెచ్‌డీ పరీక్షలు వెంటనే నిర్వహించాలని ప్లకార్డులు, ఫ్లెక్సీలు చేత పట్టుకుని 'వుయ్ వాంట్ జస్టిస్'అంటూ నినాదాలు చేశారు. 2019 నుంచి 2023 వరకు ఏపీఆర్‌సెట్ ద్వారా చేరిన వారికి అకారణంగా పరీక్షలు నిలిపివేయడం పట్ల పరిశోధక విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైవా, ప్రీ-పీహెచ్‌డీ పరీక్షలు వెంటనే నిర్వహించాలని, ప్రీ-టాక్ పూర్తి చేసుకున్న వారికి వెంటనే అవార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. తమ మనోభావాలతో వర్సిటీ అధికారులు ఆటలాడుకోవడం ఎంత మాత్రం సమంజసం కాదని అన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశోధక విద్యార్థులతో చర్చించారు. ఆందోళన విరమించాలని కోరారు. అయితే, తమకు వర్సిటీ అధికారుల నుంచి స్పష్టమైన హామీ వచ్చేంత వరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదని తెగేసి చెప్పారు. దీంతో పోలీసులు విద్యార్థుల డిమాండ్లను వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

పరీక్షల నిర్వహణకు వీసీ హామీ

టీడీఆర్-హబ్ డీన్ ఆచార్య మల్లికార్జునరావు నిరసనకు దిగిన విద్యార్థుల వద్దకు వచ్చి చర్చించారు. పీహెచ్‌డీ స్కాలర్స్‌కు త్వరలోనే పరీక్షలు నిర్వహించి, అవార్డులు ప్రదానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఇదే విషయాన్ని వైస్ చాన్సలర్ చెప్పాలని పీహెచ్‌డీ స్కాలర్స్ పట్టుబట్టారు. దీంతో ఆయన పీహెచ్‌డీ స్కాలర్స్ జేఏసీ ప్రతినిధులను వీసీ జి.శశిభూషణరావు వద్దకు తీసుకువెళ్లారు. ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయిలో సమీక్ష జరిగిందని, త్వరలోనే తగిన ఏర్పాట్లు చేస్తామని వీసీ హామీ ఇచ్చినట్లు జేఏసీ ప్రతినిధులు తెలిపారు.

వర్సిటీ అధికారుల తీరు మారాల్సిందే..

టీడీఆర్-హబ్ ద్వారా జరిగిన పీహెచ్‌డీ ప్రవేశాలపై ఏమైనా అనుమానాలు ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవచ్చని.. కానీ తమపై కక్ష గట్టినట్లుగా పరీక్షలు నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని పరిశోధక విద్యార్థులు అన్నారు. నిరసన విరమించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. వర్సిటీ అధికారుల తీరు మారాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీఆర్ సెట్ రాసి, మెరుగైన ర్యాంకులు సాధించి వర్సిటీలో పీహెచ్‌డీ చేద్దామని ఇక్కడికి వస్తే.. అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు తమను బాధపెట్టాయన్నారు. తక్షణమే ప్రీ-పీహెచ్‌డీ, వైవా పరీక్షలు నిర్వహించాలని, ప్రీ-టాక్ పూర్తయిన వారికి అవార్డులు ప్రదానం చేయాలని డిమాండ్ చేశారు.

కేర్ ఆస్పత్రిలో రోగి మృతిపై ఆందోళన

- మృతదేహం ఇచ్చేందుకు రూ.5 లక్షల డిమాండ్

ఆరిలోవ: హెల్త్‌సిటీలోని కేర్ ఆస్పత్రిలో ఒక రోగి మృతి చెందడం ఆందోళనకు దారి తీసింది. ఆస్పత్రి యాజమాన్యం మృతదేహాన్ని అప్పగించడానికి రూ.5లక్షలు డిమాండ్ చేయడంతో మృతుడి కుటుంబ సభ్యులు నిరసనకు దిగారు. మృతుడి బంధువులు తెలిపిన వివరాలివి.. చోడవరానికి చెందిన బండి శ్రీధర్ (55) గుండెనొప్పితో బాధపడుతుండగా, ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు కుటుంబ సభ్యులు హెల్త్‌సిటీలోని కేర్ ఆస్పత్రిలో చేర్పించారు. అతనికి అత్యవసరంగా గుండె శస్త్రచికిత్స చేయాలని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు అంగీకరించారు. ముందుగా ఆస్పత్రికి రూ.60 వేలు చెల్లించారు. అర్ధరాత్రి 12.30 నుంచి ఒంటి గంట మధ్య సమయంలో ఐసీయూలో ఉన్న శ్రీధర్‌ను చూడటానికి కుటుంబ సభ్యులు వెళ్లగా.. అతను మృతి చెందినట్లు గుర్తించారు. వైద్యులను సంప్రదించగా వారు పరిశీలించి శ్రీధర్ మరణించినట్లు నిర్ధారించారు. శ్రీధర్‌కు రెండు శస్త్రచికిత్సలు చేశామని, వాటికి సంబంధించిన ఫీజు చెల్లించాలని వైద్యులు సూచించారు. మృతదేహాన్ని అప్పగించడానికి రూ.5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో ఆగ్రహించిన శ్రీధర్ కుమారులు 'గుండె జబ్బు నయం చేస్తామని చెప్పి మా నాన్నను చంపేశారు' అంటూ వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం బంధువులకు తెలియడంతో చోడవరం నుంచి సోమవారం ఉదయం ఆస్పత్రికి చేరుకుని ఆందోళనకు దిగారు. మృతదేహం కోసం డబ్బులు చెల్లించమని, వెంటనే మృతదేహాన్ని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ సమాచారం అందుకున్న ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు, ఎస్ఐ కృష్ణ సిబ్బందితో కలిసి కేర్ ఆస్పత్రికి చేరుకున్నారు. బాధితులు, ఆస్పత్రి యాజమాన్యంతో చర్చలు జరిపారు. ముందు చెల్లించిన రూ.60వేలతో పాటు అదనంగా రూ.1.10 లక్షలు చెల్లించి మృతదేహాన్ని తీసుకువెళ్లడానికి బంధువులు అంగీకరించారని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. దీంతో ఆందోళన సద్దుమణిగింది. శస్త్రచికిత్స చేసే సమయంలో అంగీకార పత్రంపై సంతకాలు తీసుకున్నట్లు వైద్యులు తెలిపారు.